# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్థం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్థంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్థం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది – వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్థం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన

రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లో దొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

---

హిరణ్యాక్షుడు - 1

భాగవతం మూడో స్కంధం మొదలుపెడుతూ రాముడికి పోతన రాసిన పద్యం.

**క. శ్రీమహిత వినుత దివిజ**
**స్తోమ! యశస్సీమ! రాజసోమ! సుమేరు**
**స్థేమ! వినిర్జితభార్గవ**
**రామ! దశాననవిరామ! రఘుకులరామా** [3-1]

అందరికీ తెల్సిందే అయినా మళ్ళీ ఒకసారి చెప్పుకుందాం. సనక సనందనాదులు విష్ణువుని చూడ్డానికి వైకుంఠానికి బయల్దేరేరు. అయితే తెలిసో తెలియకో ద్వారపాలకులైన జయ విజయులు అడ్డం పడి వాళ్ళని లోపలకి పోనీయకపోవడం చేత వాళ్ళు రాక్షస జన్మ ఎత్తమని శపించబడ్డారు. విష్ణువు బయటకొచ్చి చెప్పేడు, "అబ్బాయిలూ నేను అత్యంత శక్తిమంతుణ్ణని వేదం కీర్తిస్తూ ఉందన్న మాట నిజమే. అయినా నేను ఈ తపస్సంపన్నుల మాట వ్యర్థం చేయలేను. అదీగాక భృత్యులు చేసిన పాపాలకి యజమాని బాధ్యుడు. అందుచేత మీరు చేసిన తప్పుకు నాక్కూడా భాగం ఉంది. అయితే మీకు చేసే సహాయం ఏమిటంటే మీరు మూడు జన్మలు నాకు శత్రువులుగా పుట్టి అనుక్షణం నన్నే తల్చుకుంటూ నా చేత చంపబడడం వల్ల మీకు ముక్తి కలుగుతుంది." వీళ్ళే హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగానూ, రావణ కుంభకర్ణులుగాను, శిశుపాల దంతవక్త్రులు గాను పుట్టి విష్ణువుచే చంపబడ్డారు. మొదటి జన్మలో పుట్టిన వీళ్ళని చంపడానికి విష్ణువు వేర్వేరు అవతారాలు ఎత్తాల్సి వచ్చింది. అందులో మొదట చంపినది హిరణ్యాక్షుణ్ణి యజ్ఞ వరాహ రూపంలో. స్థూలంగా ఇదీ కథ.

**తే. ధరణిగంపించెఁగులపర్వతములు వడఁకె**

**జలధులుగలంగెఁదారకావళులు డుల్లె**

గగనమగలెను మ్రొగ్గె దిక్కరులు దిశల

మిడుఁగుఱులెగసెఁబిడుగులు పుడమిఁబడియె [3-603]

శాపవశాన జయవిజయులు దితి గర్భంలో పడ్డారు. వాళ్ళు పుట్టగానే ఉత్పాతాలు కనిపించేయిట. ఎలాంటి ఉత్పాతాలు? భూమి కంపించింది, పర్వతాలు వణికిపోయేయి పిడుగులు పడ్డాయి.

సీ. హోమానలంబుల ధూమంబులడరెను

బ్రతికూలవాయువుల్ బలసి వీచెఁ

దరువులెల్లెడ విటతాటంబులై కూలె

గ్రహతారకావళికాంతి మాసె

బెరసి మొగిళ్లు నెత్తురువానగురిసెను

మెఱుఁగులు దెసల మిర్మిట్లుగొలిపె

స్వర్భానుడొగినపర్వమున భానునిఁబట్టె

గైకొని చిమ్మచీకట్లు పర్వె [3-604]

తే. మొనసి కుక్కలు మొఱిఁగెను మోరలెత్తి

పగలు నక్కలు వాపోయె ఖగములార్త

రవములిచ్చెను దేవతాప్రతిమలొరగెఁ

గన్నులనునశ్రుకణములుగ్రందుకొనగ [3-604.1]

ఇవేకాదు, హోమాలలో పొగ ఎక్కువైంది. ప్రతికూలమైన గాలులు వీచాయి. రాహువు అమావాస్య కానిరోజున సూర్యుణ్ణి పట్టుకున్నాడు. కుక్కలు మొరిగాయి. పట్టపగలే నక్కలు అరవడం మొదలు పెట్టాయి. దేవతా ప్రతిమలన్నీ కన్నీళ్ళతో ఒరిగిపోయేయి. ఎందుకంటే ఈ పుట్టిన వాళ్ళు అంతటివాళ్ళు మరి. ఈ అపశకునాలన్నీ రాబోయే రోజుల్ని సూచిస్తున్నాయి.

చ. దితిజఠరంబునందుఁదనతేజము మున్నిడినట్టి పుత్రు న

ద్భుతచరితున్ హిరణ్యకశిపుండనుపేరఁబ్రసూతివేళ నా

దితి మునుగన్నపట్టి రవితేజునిఁగాంచనలోచనుండు నా

**హితమతిఁబేరువెట్టి చనియెన్ నిజనిర్మలపుణ్యభూమికిన్** [3-611]

అప్పుడు వాళ్ల నాన్న కశ్యపుడు పిల్లలిద్దరికీ హిరణ్యకశిపుడు, కాంచనలోచనుడు - అంటే హిరణ్యాక్షుడు అని పెట్టేడు పేర్లు. ఇప్పుడు కూడా మనం అలాగే పెడుతున్నాము కదా పేర్లు పిల్లలకి? శృతి-ధృతి, శాంతి-కాంతి అలాగే ఈయనా పేర్లు కలిసేలాగ పెట్టాడు. పుట్టిన పిల్లలకి పేర్లు పెట్టేసి తపస్సుచేసుకోవడానికి వెళ్ళిపోయేడు. ఒక విషయం గమనించారా? పోతన వీళ్ళిదర్నీ చెడ్డవాళ్ళుగా చూపించలేదు ఇక్కడ కూడా, "అద్భుత చరితున్, రవితేజున్" అన్నాడు ఇద్దర్నీ. వాళ్లిద్దరూ అంతటివాళ్ళు.

వీళ్ళు పెరిగి పెద్దవాళ్లయ్యేసరికి బ్రహ్మ మూలాన వరాలు పొంది జనాల్ని పీడించడం మొదలు పెట్టేరు. అందులో హిరణ్యాక్షుడు భూమి తీసుకుపోయి రసాతలంలో దాచెట్ట. అప్పటికి ఒక కల్పం పూర్తి అయ్యి బ్రహ్మ నిద్రలోంచి లేచాడు. సృష్టి జరగాల్సి ఉంది. చూడబోతే భూమిలేదు. ఇప్పుడు నేను సృష్టి ఎక్కడ చేయాలీ అనుకుంటూ ఉంటే ఆయన ముక్కులోంచి ఒక చిన్న వరాహం బయటకొచ్చింది. ఒక్క క్షణంలో అది పర్వతాకారానికి పెరిగి రసాతలం వేపు బయల్దేరింది భూదేవిని ఉద్ధరించడానికి. బ్రహ్మని సృష్టిచేయమని నియమించాడూ అంటే సృష్టి చేయడానికి కావల్సినవన్నీ ఆయనే కల్పించడూ? నారుపోసినవాడు నీరుపోయడా? అందుకే ఆయన వరహావతారుడయ్యాడు.

"నాకు అన్నీ తెలుసు" అనుకునే పెద్దలూ, ప్రతీదీ సైన్సుకి అందాలి అనేవారికీ ఒక చిన్న విన్నపం. హిరణ్యాక్షుడు భూమినితీసుకెళ్ళి రసాతలంలో దాస్తే మళ్ళీ సముద్రం అనీ, అందులో వరుణుడనీ ఏమిటి కథ? అంతా గజిబిజి ఉత్తి పుక్కిట పురాణాలు అనేవారికీ, అలాంటి రంధ్రాన్వేషులకీ ఒక చిన్న ప్రశ్న వేసేవారుట రమణ మహర్షి "దేముడున్నాడా" అని అడిగితే. "దేముడిసంగతి నీకెందుకూ? నువ్వున్నావా? నువ్వు ఉన్నావు అంటే నువ్వెవరో అది తెలుసుకో చాలు. మిగతా సమాధానాలు అవే వస్తాయి తర్వాత." అదీగాక దేముడనేవాడు ఒకడున్నాడు అని నమ్మినట్టైతే ఆయ్న లెవెల్లోకి వెళ్ళి అక్కడ్నుంచి చూస్తే అన్నీ సరిగ్గా విశదమౌతాయి అంతే గానీ ఇక్కడ్నుంచి ఏదీ సమాధానం చూపించు అంటే, చూపించేవాడూ, చూసేవాడూ ఇద్దరూ అంధులే కనక కనపడేది సున్నా. చెట్టు ఎక్కితే చివర కొమ్మలోంచి అన్నీ కనపడతాయి. కానీ నేలమీద నుంచుని అబ్బేనేను నమ్మను అంటే, సరే. ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారుకానీ అజ్ఞానం బ్రహ్మ అన్లేదు కదా?

మనకి తెల్సున్నంతలో ఈ గ్రహాలూ పాలపుంతలూ అన్నీ వేగంగా పారిపోతున్నాయి ఎక్కడికో. చలనం, మార్పు అనేది ప్రతీదానికి వచ్చితీరుతుంది. ఇంకోలా చెప్పాలంటే మార్పు అనేది మాత్రం గేరంటీ; జీవితంలో ఏదొచ్చి ఏదిపోయినా. ఈ గ్రహంమీద జీవసంచారం ఉండాలంటే ఒకవిధమైన ప్రకృతి నియమాలు ఉండితీరాలి. అవి ఉండాలంటే గ్రహం కూడా సూర్యుడి చుట్టూ ఒక దిశలో ఒకే విధంగా కదుల్తూ ఉండాలి. అలాక్కాదు నిన్న ఇటువైపు తిరిగాను కనక ఇవాళ వేరేవేపు తిరుగుతాను అనిపిస్తే? అప్పుడు మనమూ లేము, మన గ్రహమూ లేదు. భూగ్రహాన్ని హిరణ్యాక్షుడు కక్ష్యలోంచి తప్పిస్తే దాన్ని విష్ణువు కక్ష్యలో పెట్టాడనుకుందాం ప్రస్తుతానికి. "ఏంటయ్యా చెప్తున్నావ్, గ్రహాన్ని కక్ష్యలో పెట్టాలంటే ఎలా కుదురుతుంది?" అన్నారంటే ఒకటే సమాధానం రామకృష్ణ పరమహంస అన్నదే - ఈ సృష్టి అంతా అమ్మ విలాసం. ఆవిడ ఇష్టం వచ్చినట్టూ దీన్ని ఆడిస్తూ ఉంటుంది. ఈ బ్రహ్మాండాలూ, అన్నీ కల్పించినవాడికి వాటిని ఒక కక్ష్యలో పెట్టడం పెద్ద పనేనా?" మనకి ఎంచుకోవడానికి రెండు మార్గాలున్నాయి ఉన్నాయి. ఆవిడ ఆటలో పాల్గొని

సంతోషంగా నవ్వుతూ డేన్స్ చేయడం. లేకపోతే ఏడుస్తూ కూర్చోవడం. కానీ డేన్స్ మాత్రం చేసితీరాలి ఎందుకంటే ఇదంతా ఆవిడ విలాసం.

సరే మళ్ళీ కథలోకివద్దాం. యజ్ఞ వరాహం కథ అలా జరుగుతూండగా హిరణ్యాక్షుడి దగ్గిర వేరే కథ జరుగుతోంది.

దిక్పాలకుల్నీ దశదిశల్నీ గెల్చి వరుణుడి కోసం సముద్రం మధ్యలోకి వెళ్ళేడు హిరణ్యాక్షుడు. ఎందుకంటే వీడి ధాటి తట్టుకోలేక వరుణుడి సైన్యాలు సముద్రంలోకి పారిపోయేయి. వీడు ఊరుకుంటాడా? తరుముకుంటూ వెళ్ళేడు. అక్కడ దివ్యప్రభలతో వెలుగొందే వరుణుడు కనిపించేడు. హర్నీ, ఇక్కడ కూచున్నావా వచ్చి ప్రతాపం చూపించు యుద్ధంలో అన్నాడు హిరణ్యాక్షుడు.

**క. సమసయముగాదని తన చి**
**త్తమునంగల రోషవహ్నిఁదాలిమి యను తో**
**యములందగనార్చుచునుప**
**శమితోక్తులఁబలికె దనుజసత్తముతోడన్** [3-620]

వరుణుడిది చూసాడు. కోపాన్ని లోపలే అణుచుకున్నాడు. ఇది సమయం కాదు అనుకున్నాడు ఎందుకంటే ఇప్పుడు శత్రువు తనకన్నా బలమైనవాడు. తనచేత చావడు. అయినా వీణ్ణి చంపడానికి విష్ణువుండగా తన చేతికి మట్టి అంటించుకోవడం ఎందుకూ? వీడికి కాస్త పురిపెట్టి పైకి తోల్తే ఆయనే చూసుకుంటాడు. అంచేత ఇలా అన్నాడు.

**చ. మనమున శాంతిఁబూని నియమంబున సంగరముజ్జగించి యే**
**ననయమునున్నవాఁడనిపుడాహవకేళిఁజరింపరాదు నీ**
**ఘనభుజవిక్రమస్ఫురితగాఢవిజృంభణమున్ జయింపఁజా**
**లిన ప్రతివీరులెవ్వారును లేరు ముకుందుడుదక్కనెక్కడన్** [3-621]

ఒరే నాయనా నేనిప్పుడు యుద్ధం చేయను. మనసులో శాంతి పూని ఉన్నాను. నీకు పోటీపడే వీరుడు ఇక్కడెవ్వరూలేరు. అయితే నీ భుజబలం అణచడానికి ముకుందుడున్నాడు. ఆయన వైకుంఠంలో ఉంటాడు. ప్రతీ యుగంలోను యుద్ధాలు చేసి నీలాంటి వాళ్లని చంపుతూ ఉంటాడు. అంచేత అక్కడికి వెళ్ళావా నీ తాట వలుస్తాడు, నీకూ యుద్ధకాంక్ష తీరుతుంది.

**ఉ. కావుననావిభుందొడరి కయ్యము దయ్యమెఱుంగఁజేసి ర**

**క్షోవర నీ భుజాబలము సొంపఱి మేదినిఁగూలి సారమే**

**యావళికాశ్రయంబగుదువచ్చటికిప్పుడ యేఁగుదేని నీ**

**చేవయు లావునేర్పడునుజెప్పఁగనేటికి మీఁదికార్యముల్ [3-626]**

అందుచేత ఇప్పుడు అక్కడికివెళ్ళావంటే నీ కోరిక తీరుతుంది. కయ్యం సంగతి దెయ్యానికి తెలుసు. నీ భుజబలం పోయి చచ్చిపోయాక కుక్కలు నిన్ను చుట్టుముడతాయి. ఆ తర్వాత జరిగేది ఇప్పుడు చెప్పడం ఎందుకూ (జెప్పగనేటికి మీది కార్యముల్) అని రెచ్చగొట్టేడు. పోతన ఈ పద్యంలో 'కయ్యము దయ్యమెఱుంగఁజేసి ' అని ఎంత లాఘవంగా చెప్పాడో చూడండి. ఇందులో 'నువ్వక్కడికివెళ్తే ఛస్తావు జాగ్రత్త సుమా' అనే హెచ్చరిక ఉంది. కానీ హిరణ్యాక్షుడు వింటేనా? "బుద్ధిః కర్మానుసారిణీ" అని ఊరికే అన్నారా?

ఇక్కడోసారి ఆగి ఆలోచిద్దాం. హిరణ్యాక్షుడు మామూలు రాక్షసుడు కాదు. సాక్షాత్తూ విష్ణువే వాడికోసం అవతారం ఎత్తవల్సి వచ్చింది. అలాంటివాడితో ఇలాగేనా మాట్లాడ్డం? ఈ రోజుల్లో ఇలా మాట్లాడితే వెంటనే శతృవు మనల్ని నరికిపారేయడూ? కానీ హిరణ్యాక్షుడు అలా చేయలేదు ఎందుకంటే ముందే వరుణుడు చెప్పేడు, "మనమున శాంతిఁబూని నియమంబున సంగరముజ్జగించి" అని. దానికి గౌరవం ఇచ్చి కోపం అంతా విష్ణువు మీద సారించాడు. ఇదే రణ ధర్మం అంటే. చచ్చిపోయే ముందు విష్ణువుతో యుద్ధం చేస్తూ మళ్ళీ ఇలా రణ ధర్మం పాటిస్తాడు కూడా. దానికి విష్ణువే ఆశ్చర్యపోతాడు.

**చ. అని వరుణుండువల్కిన దురాగ్రహమెత్తి హిరణ్యలోచనుం**

**డనయము మానసంబున భయంబొక యించుక లేక సంగరా**

**వనినెదిరింతు నేఁడమరవర్ధను దుష్టవిమర్దనున్ జనా**

**ర్దనుననుచున్ వికుంఠనగరస్ఫుటనంచితమార్గవర్తియై** [3-627]

వరుణుడు ఇలా అనేసరికి వాడికి శివమెత్తిపోయింది. నిన్ను కుక్కలు తింటాయ్ అని ఎవరైనా అంటే శివమెత్తదు మరీ? సరే అక్కడికే వెళ్తాను, దుష్ట విమర్దనుడా, జనార్ధనుడా? ఎవడు నాకు ఎదురు నిల్చేవాడు? వాణ్ణే ఎదిరిస్తాను యుద్ధంలో; నీలాంటి చేతగానివాళ్ళతో ఎందుకూ? అని ఏ మాత్రం భయం లేకుండా వైకుంఠానికి హుటాహుటిన బయల్దేరేడు.

అయితే దారిలో నారదుడు కనిపించి 'ఎక్కడికోయ్ ప్రయాణం?' అనడిగేడు. ఇదిగో ఇలా ముకుందుడు అనేవాడు ఉన్నాట్ట వైకుంఠంలో వాడి పని పట్టడానికి బయల్దేరేను అని చెప్పేడు. అప్పుడు నారదుడు అన్నాడు కదా.

**చ. గురుభుజుఁడమ్మహాత్ముఁడు వికుంఠపురంబున నేడు లేఁడు భూ**

**భరము వహింప నాదికిటి భావముఁదాల్చి రసాతలంబునం**

**దిరవుగనున్నవాఁడచటికేఁగఁగనోపుదువేనినేఁగుమం**

**దరయఁగగల్గు నీకునసురాంతకుతోడి రణంబవశ్యమున్** [3-630]

ఇప్పుడు మహావిష్ణువు వైకుంఠంలో లేడు. యజ్ఞ వరహావతారంలో రసాతలానికి వెళ్ళేడు భూమినుద్ధరించడానికి. ఆయన అసురాంతకుడు. నీకు ఎలాగా ఆయనచేతిలో చావాలని ఉన్నట్టుంది, అక్కడికిగానీ వెళ్లావా నీకు ఆయనికీ తప్పకుండా యుద్ధం జరుగుతుంది. ఇలా అనే సరికి వీడి కోపం మరింత ఎక్కువైంది.

**క. కనుఁగవ నిప్పులురాలఁగ**

**సునిశితదంష్ట్రాగ్రయుతవసుంధరుఁడగుచున్**

**తనకెదురేతేరఁగ నీ**

**వనచరమేరీతినిపుడు వనచరమయ్యెన్** [3-639]

సరే రసాతలానికే వెళ్తాను అనిచెప్పి అక్కడికే వెళ్ళేడు. అక్కడ యజ్ఞవరాహం కదం తొక్కుతోంది. హిరణ్యాక్షుడు సామాన్యుడా? దీన్ని చూసి ఇలాగనుకున్నాడు. కళ్లల్లో నిప్పులు రాల్తూండగా, "వనాల్లో ఉండే ఈ వరాహం వనాల్లోకి (నీళ్లల్లోకి) ఎలా వచ్చింది? దీనికి ఇక్కడేమిటిపని?" వచ్చే వ్యాసంలో శ్రీహరి హిరణ్యాక్షుణ్ణి ఎలా చంపాడో, ఎందుకు అలా చంపాడో చదువుకుందాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS